క్లుప్తంగా

కల్పవృక్ష వాహనంపై గ్రామోత్సవం



బలభద్రపురంలో కల్పవృక్ష వాహనంపై స్వామివారి గ్రామోత్సవం

బిక్కవోలు: మండలంలోని బలభద్రపురం గ్రామంలోని శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆరో రోజు కల్పవృక్ష వాహనంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. ఆదివారం ఉదయం సుప్రభాతసేవ, లఘు అర్చన, తోమాలసేవ, స్వస్తివాచక్రం, పంచామృతాభిషేకం, గోపూజ, పవళింపుసేవ నిర్వహించారు. అనంతరం సాయంత్రం స్వామివారిని కల్పవృక్ష వాహనంపై గ్రామోత్సవం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ వ్యవస్థాపక అధ్యక్షుడు మల్లిడి గంగారెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చంద్రశేఖరస్వామికి ప్రత్యేక పూజలు



చంద్రేడులో కొలువైన కాత్యాయినీ సమేత చంద్రశేఖర స్వామి

రంగంపేట: మండల పరిధిలోని చంద్రేడు గ్రామంలో కొలువైన కాత్యాయినీ సమేత చంద్రశేఖర స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకుడు మైలవరపు కృష్ణ ఆధ్వర్యంలో మాస శివరాత్రి సందర్భంగా తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం సుందరంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

బీజేపీ మండలాధ్యక్షుడిగా దుర్గారెడ్డి

బిక్కవోలు: భారతీయ జనతా పార్టీ మండలాధ్యక్షుడిగా కొమరిపాలెం గ్రామానికి చెందిన గుడిమెట్ల దుర్గారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం పందలపాక పడాల సూర్యనారాయణ రెడ్డి ఫౌండేషన్ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయనను మండల బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికకు అధ్యక్ష ప్రతినిధిగా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఆర్‌ఓగా ఏపీఆర్ చౌదరి వ్యవహరించారు. కార్యదర్శిగా బిక్కవోలు గ్రామానికి చెందిన లక్ష్మిని ఎంపిక చేశారు. అనంతరం వారిని అనపర్తి నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి శివరామరాజు, బీజేపీ జిల్లా నాయకులు బొగాది వెంకటరమణ, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పడాల రామారెడ్డి, పందలపాక మాజీ సొసైటీ అధ్యక్షులు పడాల సూర్యనారాయణరెడ్డి తదితరులు సత్కరించారు.

అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు



ఎస్సై శ్రీను నాయక్

పెదపూడి: నూతన సంవత్సర వేడుకల సందర్భంగా బహిరంగంగా మద్యం సేవించి అల్లర్లకు పాల్పడితే అటువంటి వారిపై కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని అనపర్తి ఎస్సై శ్రీను నాయక్ హెచ్చరించారు. ఆయన అనపర్తిలో ఆదివారం మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకలను పురస్కరించుకుని బైకులపై అర్ధరాత్రి విచ్చలవిడిగా తిరగరాదన్నారు. రోడ్లపైకి వచ్చి బాణా సంచా కాల్చడం నిషేధమన్నారు. గుంపులు గుంపులుగా ఉండవద్దని హెచ్చరించారు.

31న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

బిక్కవోలు: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 31వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శ్రీనివాస్ ఆదివారం తెలిపారు. ఎంపీపీ బుద్దాల కన్నారావు అధ్యక్షత జరిగే సమావేశానికి ఎమ్మెల్యేతో పాటు మండలంలోని ప్రజా ప్రతినిధులు హాజరవుతారన్నారు. మండల స్థాయి అధికారులు పూర్తి నివేదికలతో హాజరు కావాలని కోరారు.

స్పాపై పోలీసుల దాడి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): స్పా ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్న ముఠాను రాజమహేంద్రవరం ప్రకాష్ నగర్ పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. సెంట్రల్ జోన్ డీఎస్పీ రమేష్‌బాబు ఈ వివరాలు తెలిపారు. ఎస్పీ నరసింహ కిషోర్‌కు అందిన సమాచారం మేరకు, ప్రకాష్‌నగర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ ఆర్ఎస్‌కే బాజీలాల్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి జేఎన్ రోడ్‌లోని హ్యాపీ స్ట్రీట్ సమీపాన ఉన్న కలర్స్ బ్యూటీ సెలూన్-స్పాపై దాడి చేశారు. వ్యభిచారం జరుగుతున్నట్టు నిర్ధారించారు. స్పా నిర్వాహకులతో పాటు, ఇద్దరు విటులను, ఆరుగురు యువతులను గుర్తించి, కేసు నమోదు చేశారు.

రహదార్లకు మోక్షమెప్పుడో..?

- రోడ్ల అభివృద్ధి పనులు పూర్తయ్యేనా?
- ఐదేళ్లలో రూ.185 కోట్ల మంజూరు
- పట్టించుకోని ప్రభుత్వ యంత్రాంగం
- కూటమి సర్కారు నిర్లక్ష్యంతో..



రాజానగరం-కలవచర్ల రోడ్డులో లేచిన కంకర రాళ్లు



వర్షాలతో కంకర రాళ్లు కొట్టుకుపోయి ఏర్పడిన గోతులు

రాజానగరం: ప్రభుత్వాలు మారినా, పాలకులు మారినా అభివృద్ధి ఆగకూడదనేది ప్రజాస్వామ్యంలో ప్రధాన సూత్రం. రాజానగరం నియోజకవర్గంలో మాత్రం గతంలో చేపట్టిన పనులతో తమకే మాత్రం సంబంధం లేదన్నట్టుగా ప్రస్తుత పాలకుల తీరు ఉందని జనం వాపోతున్నారు. జీవన గమనంలో ప్రధాన భూమికను పోషించేది రోడ్లనేది సుస్పష్టం. ప్రస్తుతం గత ప్రభుత్వంలో అసంపూర్తిగా మిగిలిన కొన్ని రోడ్ల పనులు పూర్తికాక, ఆయా రోడ్లపై ప్రయాణించే వారంతా అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో చేపట్టిన అభివృద్ధి పనులను పూర్తి చేసే బాధ్యత ప్రస్తుత పాలకులు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు.

గత ప్రభుత్వంలో..

నియోజకవర్గంలో గత ప్రభుత్వంలో రోడ్ల అభివృద్ధికి అప్పటి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అధిక ప్రాధాన్యమిచ్చారు. గడచిన ఐదేళ్లలో నియోజకవర్గంలోని రోడ్ల అభివృద్ధికి రూ.185 కోట్ల నిధులు తీసుకువచ్చారు. అయితే కొన్ని ప్రాంతాలలో రోడ్ల అభివృద్ధి పనులు పూర్తి కాగా, మరికొన్ని ప్రాంతాలలో సాంకేతిక కారణాలతో పనులు పూర్తి కాలేదు. వాటి పనులు జరిగే సమయంలో ఎన్నికల నగారా మోగడంతో ఆయా పనులకు బ్రేకులు పడ్డాయి. ఎన్నికల తరువాత రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అసంపూర్తిగా మిగిలిన పనులను పూర్తిచేసే ప్రక్రియ ముందుకు సాగడం లేదు. ఈ క్రమంలో ఆ రోడ్ల అభివృద్ధి ఎప్పటికి పూర్తయ్యేనా? అని స్థానికులు, వాటిపై నిరంతరం ప్రయాణించే వారు బాహాటంగానే సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

ఇవి పూర్తయ్యేనా?

నియోజకవర్గంలో గత ప్రభుత్వ హయాంలో రూ.1,773 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టగా, వాటిలో రోడ్ల అభివృద్ధికి రూ.185 కోట్లు పైబడి నిధులు కేటాయించారు. వీటి పనులు పూర్తయ్యే సమయంలో సార్వత్రిక ఎన్నికలు రావడంతో కొన్నిచోట్ల రోడ్ల అభివృద్ధి పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయి. మేజర్ ప్రాజెక్టుగా పేరొందిన రాజమహేంద్రవరం-సీతానగరం రోడ్డును నాలుగు లేన్లుగా అభివృద్ధి చేస్తూ, గ్రామాలలో సీసీ రోడ్లు నిర్మించారు. వీటి పనులు చాలావరకు పూర్తి కాగా రఘుదేవపురం - సీతానగరం వరకు అసంపూర్తిగా మిగిలిపోయాయి. అలాగే మధ్యలో నాలుగు చోట్ల కల్వర్టులు పూర్తి చేయవలసి ఉంది. రాజానగరం జంక్షన్ నుంచి కలవచర్ల, సీతానగరం మీదుగా గాదరాడకు రెండు లేన్ల రహదారి విస్తరణ పనులు గ్రావెల్ వర్క్స్ వరకు పూర్తయ్యాయి. తారు మిక్సింగ్ వేసే ప్రక్రియ జరగాల్సి ఉంది. ఈ పనులు జరగకపోవడంతో ప్రస్తుతం ఆ రోడ్డుపై వేసిన గ్రావెల్ లేచి, ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. అలాగే వీటితోపాటు ముగ్గళ్ల-కోరుకొండ, కోరుకొండ-నాగంపల్లి, పల్లకడియం-రాధేయపాలెం, దివాన్‌చెరువు-నరేంద్రపురం, పల్లకడియం-వడిశలేరు, రాఘవపురం-గరగళంపాలెం, బుచ్చింపేట-తొర్రేడు రోడ్ల అభివృద్ధి పనులు పూర్తి కావాల్సి ఉంది.

పనులు పూర్తి చేయాలి



రాజానగరం నుంచి కలవచర్ల, సీతారామపురం, గాదరాడకు రోడ్డు విస్తరణ పనులు 90 శాతం వరకు గత ప్రభుత్వ హయాంలోనే పూర్తయ్యాయి. ఎన్నికల కారణంగా మిగిలిన పనులు నిలిచిపోయాయి. తరువాత వచ్చిన పాలకులు ఆ 10 శాతం పనులను పట్టించుకోకపోవడం వలన ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అసంపూర్తిగా నిలిచిపోయిన పనులను పూర్తి చేయవలసిన బాధ్యత పాలకులపై ఉంది. వాటిని విస్మరించడం మంచిది కాదు.

– దాట్ల రఘువర్మ, కలవచర్ల

గ్రామాల్లో సీసీ రోడ్లు వేశారు



రాజానగరం నుంచి సీతారామపురం, కలవచర్ల మీదుగా గాదరాడకు రోడ్డు విస్తరణ పనులు చాలావరకు పూర్తయ్యాయి. గ్రామాలలో ప్రజల అభీష్టం మేరకు సీసీ రోడ్డుగా అభివృద్ధి చేసి, డ్రైన్లు నిర్మించారు. గ్రావెల్ పరచిన రోడ్డుపై తారు వేయకపోవడం వలన కంకర లేచి, వర్షాలకు గోతులు పడటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. సత్వరమే నిర్మాణం పూర్తి చేయాలి.

– మేడిశెట్టి కాపు, సీతారామపురం

ఆదిత్యునికి పంచామృతాభిషేకాలు



జి.మామిడాడలో ప్రత్యేక అలంకరణలో సూర్యదేవుడు, దేవేరులు

పెదపూడి: జి.మామిడాడ గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీ ఉషా, ఛాయ, పద్మిని, సౌంజ్ఞ సమేత ఆదిత్యునికి ఆదివారం ఆలయంలో పంచామృతాభిషేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకట నరసింహాచార్యులు ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి విశేష పూజలు చేశారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు ఆలయ కమిటీ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసింది.

ఒకటిన అందుబాటులో మాజీ ఎమ్మెల్యే

పెదపూడి: నూతన సంవత్సర వేడుకల సందర్భంగా జనవరి 1వ తేదీన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి అనపర్తిలో అందుబాటులో ఉంటారని వైఎస్సార్ సీపీ కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది. 1వ తేదీన గంగిరెడ్డి నర్సింగ్ హోం వద్ద ఉదయం 8.30 గంటల నుంచి అందుబాటులో ఉంటారన్నారు. శుభాకాంక్షలు తెలియజేయడానికి వచ్చే పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పూల దండలు, బొకేలు తీసుకురావద్దని కోరారు.

అబ్బురపర్చిన సృజనాత్మకత



అక్షరాల బ్యాగ్

టీఎల్ఎం మేళాలో కొత్త ఆవిష్కరణలు



టీఎల్ఎం మేళాలో మోడళ్లను పరిశీలిస్తున్న కోర్సు కో-ఆర్డినేటర్



లెక్కల కోసం రూపొందించిన చిట్టి రోబో

రాజానగరం: హ్యాండ్ బ్యాగ్‌పై అమరిన తెలుగు అక్షరాలు, కూడికల యంత్రం, టార్చిలైట్‌తో పదాల గుర్తింపు, అంకెల క్యూబ్, చిట్టి బుర్రలో ఇమిడిన అక్షరమాల.. ఇలా అనేక అక్షరాల పూతోటలో పదాల పంట విరబూసిందా అన్నట్టుగా ఉపాధ్యాయులు రూపొందించిన బోధనోపకరణాలతో టీఎల్ఎం మేళా అందరినీ ఆకట్టుకుంది. మండలంలోని కొండగుంటూరు పాలిటెక్నిక్ కళాశాలలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని కొంతమంది ఉపాధ్యాయులకు ఇస్తున్న ఎఫ్ఎల్ఎన్ ఆరవ బ్యాచ్ శిక్షణా తరగతులలో భాగంగా ఆదివారం ఈ మేళాను ఏర్పాటుచేశారు. అబ్బురపరచే సృజనాత్మకతతో వారు రూపొందించిన బోధనోపకరణాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. లోకాస్ట్, నోకాస్ట్ మెటీరియల్‌తో వారు తయారు చేసిన బోధనోపకరణాలు పలువురి సందర్శకుల ప్రశంసలు అందుకున్నాయి. వీటిలో వైవిధ్యంగా రూపొందించిన వాలు జడ, చేప బొమ్మలతో తీసివేతలు, బొమ్మ చూడు-అక్షరం పట్టు (గుర్తించు), మయూరాలు, మ్యాజిక్ నంబరు బోర్డు, జామెట్రికల్ గార్డెన్, అక్షరాల బావి తదితర బోధనోపకరణాలు కూడా ఉన్నాయి. తెలుగు, గణితం, ఇంగ్లిష్ బోధనకు సంబంధించి 190కి పైగా వివిధ రకాల వర్కింగ్ మోడళ్లను రూపొందించారు. ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన 'చిట్టి రోబో'(గణితం సబ్జెక్టు కోసం)ను రంగంపేట మండలం, సింగంపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు, శిక్షణ శిబిరం కేఆర్‌పీ సీహెచ్ గౌతమ్‌కృష్ణ రూపొందించారు. ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీలో భాగంగా కాకినాడ, కోనసీమ, తూర్పు గోదావరి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు చెందిన 350 మంది ఉపాధ్యాయులు ఇక్కడ శిక్షణ పొందుతున్నారు. కార్యక్రమంలో కోర్సు కో-ఆర్డినేటర్ పి.రాంబాబు, ఎంఈఓ సీహెచ్‌వీ సోమిరెడ్డి, ప్రథమ్ జిల్లా కో-ఆర్డినేటర్ అనూష, కేఆర్‌పీలు కె.ఈశ్వర్రావు, గౌతమ్‌కృష్ణ, డీఆర్పీలు పాల్గొన్నారు.

మామిడి తోటల్లో సస్యరక్షణ చర్యలు



దివ్యశ్రీ, మండల ఉద్యాన శాఖ అధికారి



మొగ్గ దశలో ఉన్న మామిడి

రాజానగరం: ప్రస్తుతం ఉన్న వాతావరణ పరిస్థితులకు అనుగునంగా మామిడి తోటలలో చేపట్టవలసిన సస్యరక్షణ చర్యలపై మండల ఉద్యాన శాఖ అధికారి కె.దివ్యశ్రీ రైతులను సూచనలిచ్చారు. ప్రస్తుతం మామిడి తోటలు మొగ్గ, పచ్చి పూత, పూత దశలలో ఉన్నాయి. ప్రస్తుతం వాతావరణం చల్లగా ఉండి, మబ్బులు వేస్తున్నందున రసం పీల్చే పురుగులతో పాటు, ఇతర తెగుళ్ల ఉధృతి కలిగే అవకాశం ఉంది. ఈ కారణంగా వాటిని సకాలంలో గుర్తించి, తోటలను కాపాడుకునే విధంగా సస్యరక్షణ చర్యలను చేపట్టాలని ఆమె వివరించారు.

- పూమొగ్గ దశలో ఉన్న తోటలలో తేనె మంచు పురుగులు, పక్షి కన్ను తెగులు, బూడిద తెగుళ్ల నివారణకు ఇమిడాక్లోప్రిడ్ 0.3మి.లీ., క్లోరోథలోనిల్ 2 మి.లీ., ఒక లీటరు నీటిలో కలపి, చెట్టు ఆకులు, కాండంపై పిచికారీ చేయాలి.
- పచ్చి పూత దశలో ఉన్న తోటలలో థయామిథాక్సమ్ 03 గ్రా., లేదా బుప్రోఫెజిన్ 1.5 మి.లీ.,తో పాటు, హెక్సాకోనజూల్ 2 మి.లీ., లేదా కార్బండజిమ్, మాంకోజెబ్ 2 గ్రా., ఒక లీటరు నీటి కలిపి పిచికారీ చేయాలి.
- ప్రస్తుత సమయంలో తోటలకు నీరు పెట్టడం నిలిపివేయాలని ఆమె సూచించారు. అలాగే కలుపును నివారించాలని చెప్పారు.

సేవాతత్పరుడికి సత్కారం



సూర్యవెంకటరావును సత్కారిస్తున్న అతిథులు

రాజానగరం: శుభ కార్యక్రమాలలో మిగిలే ఆహారాన్ని వృథాగా పారవేయకుండా, ఆ ఆహారాన్ని సేకరించి, అభాగ్యులకు పంచుతున్న సేవాతత్పరులు రాజానగరానికి చెందిన ఉప్పల సూర్యవెంకటరావును ఆదివారం ఘనంగా సన్మానించారు. స్థానిక అన్నదాత సత్రం కల్యాణ మండపంలో శ్రీదుర్గా బ్లడ్ డోనర్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, సీఐ ఎస్పీ వీరయ్యగౌడ్, సినీ హాస్య నటుడు భద్రం, కూటమి నాయకుల చేతుల మీదుగా నిర్వాహకులు ఆయనను దుశ్శాలువాతో సత్కరించారు. అన్నం పరబ్రహ్మ స్వరూపం పేరిట అవార్డును కూడా బహూకరించారు.

ఆలయాల్లో ధనుర్మాస ఉత్సవాలు

మధురపూడి: కోరుకొండలో వెలసిన స్వయంభు శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవాలయంలో ఆదివారం ధనుర్మాస ఉత్సవాలు జరిగాయి. వచ్చే సంవత్సరం జనవరి 13వ తేదీ వరకూ ఈ ఉత్సవాలు నిర్వహిస్తారు. ఉదయం ఆలయంలో సేవాకాలం జరిగింది. సాయంత్రం గోదాదేవి అమ్మవారి పల్లకీ సేవ నిర్వహించారు. అలాగే స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో ఉత్సవాలు జరిగాయి.

ఆర్‌సీఎం చర్చిలో తిరు కుటుంబ పండగ

మధురపూడి: కోరుకొండ ఎస్సార్‌నగర్‌లోని ఆర్‌సీఎం చర్చిలో ఆదివారం తిరు కుటుంబ పండగ జరిగింది. ఈ సందర్భంగా రెవరెండ్ ఫాదర్ మాణిక్యం వాక్యసందేశమిచ్చారు. ప్రతి కుటుంబంలో శాంతి, సమాధానం ఏర్పడాలంటే బైబిల్ పఠనం ద్వారానే సాధ్యమన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి.

కోడిపందేలు ఆడుతున్న ఐదుగురి అరెస్ట్

సీతానగరం: మండలంలోని నల్గొండలో కోడిపందేలు ఆడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేసినట్టు ఎస్సై డి.రామ్‌కుమార్ ఆదివారం తెలిపారు. వీరిలో నలుగురు కోరుకొండ మండల కోటికేశవరానికి చెందిన వారు కాగా, కూనవరానికి చెందిన ఒకరున్నట్టు చెప్పారు. వారి వద్ద నుంచి రూ.6,700 నగదు, ఎనిమిది మోటార్ సైకిళ్లను, మూడు పందెం కోళ్లు, రెండు కోడి కత్తులు స్వాధీనం చేసుకున్నామని వివరించారు. వారిపై కేసు నమోదు చేశామని, కోర్టులో హాజరుపర్చుతామని ఎస్సై తెలిపారు.

నేడు జాబ్ మేళా

రాజానగరం: ఏపీ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పనా సంస్థ సంయుక్తాధ్వర్యంలో స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం జాబ్ మేళా జరుగనుంది. ఈ మేరకు ఆయా సంస్థల అధికారులు హరీష్‌చంద్ర ప్రసాద్, పేరుమాళ్‌రావు వెల్లడించారు. ఐటీఐ, డిప్లమా, బీటెక్, ఎంబీఏ, ఫార్మసీ, డిగ్రీ, ఇంటర్ పూర్తి చేసిన 19 నుంచి 35 ఏళ్ల వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. మూడు కంపెనీలకు చెందిన ప్రతినిధుల ఆధ్వర్యంలో ఇంటర్వ్యూల ద్వారా ఎంపికలు జరుగుతాయన్నారు. అర్హత, ఆసక్తి ఉన్న నిరుద్యోగ యువత ఉదయం 10 గంటలకు జాబ్ మేళా జరిగే ప్రాంగణానికి చేరుకోవాలన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

రాజానగరం: మండలంలోని సంపత్‌నగరం సబ్‌స్టేషన్ పరిధిలో సోమవారం ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దాట్ల శ్రీధర్‌వర్మ తెలిపారు. టవర్ లైన్ పనుల కోసం తుంగపాడు, జి.యర్రంపాలెం 11 కేవీ ఫీడర్లపై విద్యుత్ సరఫరాను నిలిపివేస్తారన్నారు. ఈ కారణంగా సబ్‌స్టేషను పరిధిలోని పాత తుంగపాడు, సంపత్‌నగరం, జి.యర్రంపాలెంలలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

కబడ్డీ జట్టు ఎంపిక

ప్రకాశం నగర్: అంతర్ జిల్లాల కబడ్డీ బాలురు, బాలికల చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా కబడ్డీ జట్టును ఎంపిక చేశారు. ఆదివారం స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఈ ఎంపికలు ముగిశాయి. ఈ జట్టు జనవరి 3, 4, 5 తేదీల్లో కర్నూలులో జరిగే అంతర్ జిల్లాల కబడ్డీ పోటీల్లో పాల్గొంటుంది.

వ్యర్థాలతో సాగు నీటికి ఆటంకం

శ్రీరంగపట్నంలోని బురద కాలువ దుస్థితి



వ్యర్థాలతో ఉన్న శ్రీరంగపట్నం బురద కాలువ

మధురపూడి: సాగునీటి కాలువలు వ్యర్థాలు, చెత్తతో నిండిపోతున్నా యి. వ్యవసాయ అవసరాలతో పాటు, ప్రజలకు ఉపయోగకరమైన కాలువల్లోని నీరు వ్యర్థాలమయం అవుతున్నాయి. కోరుకొండ మండలంలో 20 పంచాయతీలున్నాయి. ఇక్కడ 79 వేల మంది జీవనం సాగిస్తున్నారు. మండలంలో బురద కాలువ, పుష్కర కాలువలున్నాయి. వీటిలో శ్రీరంగపట్నంలోని బురద కాలువ నీరు వ్యవసాయంతో పాటు, ప్రజల నీటి అవసరాలను తీరుస్తోంది. ఈ కాలువలో వ్యర్థాలు, చెత్త వేయడంతో నీటి ప్రవాహానికి ఆటంకంగా మారింది. అంతేకాకుండా దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో స్థానికులు రోగాల బారిన పడుతున్నారు. పంచాయతీరాజ్ అధికారుల నిర్లక్ష్యంతో కాలువలో పూడికల తొలగింపు, శుభ్రం చేయడం వంటి చర్యలు చేపట్టడం లేదు. ప్రజల ఆరోగ్యంపై కనీస శ్రద్ధ వహించడం లేదు. దీంతో అనారోగ్య, పారిశుధ్య సమస్యలు విలయతాండవం చేస్తున్నాయి. ఈ కాలువ రంపచోడవరం ఏజెన్సీ ప్రాంతంలోని గంగవరం మండలం సూరంపాలెం ప్రాజెక్టు నుంచి వస్తోంది. కాలువ నీరు మూడు మండలాల్లోని 12 గ్రామాలకు ఉపయోగపడుతోంది. ఇలాఉండగా శ్రీరంగపట్నం ప్రజలు వ్యర్థాలను ఈ కాలువలో వేయడంతో చెత్త పేరుకుపోయింది. చెత్తను తొలగించి, ప్రజా రోగ్య పరిరక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. పంచాయతీరాజ్ శాఖ అధికారుల పనితీరుకు ఇది అద్దం పడుతోందని స్థానికులు విమర్శిస్తున్నారు.

నిండు నూరేళ్లూ పాటలతో అలరించాలి

- జిత్‌మోహన్‌మిత్రాకు వక్తల ఆకాంక్ష
- ఘనంగా గాన స్వర సప్తతి



జిత్‌మోహన్‌మిత్రా దంపతులను సత్కరిస్తున్న అతిథులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): సినీ ప్రముఖుడు జిత్‌మోహన్‌మిత్రా గడిచిన ఏడు దశాబ్దాలుగా పాటలతో అలరిస్తున్నారని, నిండు నూరేళ్లు ఇలాగే ఆనందాన్ని పంచాలని పలువురు వక్తలు ఆకాంక్షించారు. నట గాయకుడు శ్రీపాద జిత్‌మోహన్ మిత్రా తొలిపాట పాడి 70 వసంతాలు పూర్తయిన సందర్భంగా జిత్ గాన స్వర సప్తతి పేరిట 70 వసంతాల గాన వైభవ స్వర్ణోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. సంఘ సేవకుడు పట్టపగలు వెంకట్రావు అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, గోరంట్ల బుచ్చయ్య చౌదరి, మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు, చాంబర్ పూర్వాధ్యక్షుడు దొండపాటి సత్యంబాబు, ఇన్నీసుపేట బ్యాంకు చైర్మన్ కోళ్ల అచ్యుతరామారావు, గుమ్మడి సమర్పణరావు, డాక్టర్ కేవీ చౌదరి, తురగా సూర్యారావు, నిమ్మలపూడి గోవింద్, రవీంద్రనాథ్, కోలమూరు ప్రభాకరరావు, ఎండీ ఖాదర్‌ఖాన్, అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ, కళాకారులను ప్రోత్సహించాలని, మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాలన్నారు. సిటీ ఎమ్మెల్యే శ్రీనివాస్ మాట్లాడుతూ, సినీ నటుడిగా, గాయకుడిగా 70 ఏళ్ల పాటు అలరించడం సామాన్య విషయం కాదన్నారు. ఔత్సాహిక గాయనీగాయకులు ఆయనను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. మాజీ ఎంపీ ఉండవల్లి మాట్లాడుతూ, జిత్‌మోహన్ మిత్రా వందేళ్ల పాటు పాటలు పాడుతూ ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. సోము వీర్రాజు మాట్లాడుతూ, జిత్‌మోహన్‌మిత్రా రాజకీయ నాయకుడిగా, గాయకుడిగా, సినీ నటుడిగా ఆయన ప్రస్థానాన్ని గుర్తుచేశారు. మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు మాట్లాడుతూ, జిత్‌కు 83 ఏళ్ల వయస్సులోను యువ గాయనీగాయకులతో పోటీగా పాడే సత్తా ఉందని అభినందించారు. అనంతరం జిత్ దంపతులను ఘనంగా సత్కరించారు. జిత్ మోహన్ మ్యూజిక్ అకాడమీ కళాకారులను జిత్‌మోహన్ మిత్ర బృందం సభ్యులను అతిథులు సన్మానించారు. ఈ సందర్భంగా జిత్ మోహన్‌మిత్రా మాట్లాడుతూ, త్వరలోనే సంగీత విభావరి నిర్వహిస్తానని చెప్పారు. కాగా ఉదయం పది మంది కళాకారులకు సన్మానం చేశారు. ముందుగా సంగీత విభావరి జరిగింది. ఈ కార్యక్రమంలో ప్రముఖులు ముద్రగడ ఏసుబాబు, పీవీఎస్ కృష్ణారావు, వి జగపతి, జె శివప్రసాద్, ఏఎస్ ఆనంద్, బిక్కిన రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.